క్లుప్తంగా

7న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమావేశం

జగ్గయ్యపేట: ఈ నెల 7న నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశం జరుగుతుందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని కోదాడ రోడ్డులో గల బి కన్వెన్షన్ హాల్లో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి మాజీ ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు హాజరుకావాలని కోరారు.

శరవేగంగా ఆలయ అభివృద్ధి పనులు



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు తెలిపారు. ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషితో రూ.13 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని చెప్పారు. వాటికి సంబంధించి ఆలయం వద్ద కేశఖండనశాల, డార్మెటరీ, టాయిలెట్ బ్లాక్, వార్షిక కల్యాణం జరిగే స్థలం చుట్టూ సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తి కావచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఐదు అర్జీలు



నందిగామ: ప్రజా సమస్యల పరిష్కారానికి పబ్లిక్ గ్రీవెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆర్డీవో ఎ.రవీంద్రరావు తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ (పిజిఆర్ఎస్) నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన మొత్తం 5 అర్జీలు అందాయని ఆర్డీవో తెలిపారు. వాటిలో రెవెన్యూ సమస్యలకు సంబంధించి 3, పోలీస్ శాఖకు సంబంధించి ఒకటి, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఒకటి చొప్పున మొత్తం ఐదు అర్జీలు అందాయన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి సోమవారం నిర్వహించనున్న పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించడంతోపాటు వెంటనే ఆ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై ఇద్దరు దాడి



జగ్గయ్యపేట: ఒక వ్యక్తిపై ఇద్దరు దాడి చేసిన ఘటన మండలంలోని వేదాద్రి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన భూక్యా రవీంద్ర రేషన్ వాహనం ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తుంటాడు. ఈ క్రమంలో మధ్యాహ్న సమయంలో రేషన్ పంపిణీ అనంతరం ఇంటికెళ్లి వస్తుండగా గ్రామానికి చెందిన రాంబాబు, శ్రీకాంత్‌లు ఒక్కసారిగా దాడి చేయటంతో తీవ్ర గాయాలయ్యాయి. అడ్డువచ్చిన భార్యపై కూడా దాడి చేశారు. గ్రామస్తులు 108 వాహనం ద్వారా జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరునిగా ఉండటంతోనే దాడి చేసినట్లు తెలిసింది. భార్య కరుణ చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మంచినీటి బావి అభివృద్ధి



శివాపురం(పెనుగంచిప్రోలు): గ్రామంలో శిథిలావస్థలో ఉన్న మంచినీటి బావిని సుమారు రూ. 3 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. గ్రామంలోని ఏలూరు వంశీకులు ఈ కార్యక్రమానికి పూనుకున్నారు. అభివృద్ధిలో భాగంగా బావి చుట్టూ డ్రైనేజీ, దానిపై ప్లేట్స్ అమర్చటంతో పాటు బావి చుట్టూ ఫెన్సింగ్, ఫ్లోరింగ్, లైటింగ్, గార్డెన్ ఏర్పాటుతో పాటు కరెంట్ ఉన్న సమయంలో మోటార్, లేని సమయంలో చేతిపంపు ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఎవరైనా నీటిని వాడుకోవచ్చన్నారు.

గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ



పెనుగంచిప్రోలులో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే రాజగోపాల్



నందిగామలో పింఛన్ పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోనూ ఉదయం 6 గంటలకే ఈ కార్యక్రమం ప్రారంభమైంది. నందిగామ పట్టణంలోని పలు వార్డులతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఏచూరి రాము, పలువురు అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మండలంలో 90 శాతం పింఛన్ పంపిణీ

పెనుగంచిప్రోలు: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం సాయంత్రానికి 90 శాతం పూర్తయినట్లు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆరోగ్య సిబ్బంది నాయకులతో కలిసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్, పాత సినిమాహాల్ సెంటర్‌లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, కేక్‌కట్ చేసి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని ముండ్లపాడు గ్రామంలో సర్పంచ్ గూడపాటి లావణ్య పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఉపసర్పంచ్ గుత్తా శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవి కుమార్, నాయకులు పాల్గొన్నారు.

హామీ మేరకు పింఛన్లు పంపిణీ ఎమ్మెల్యే సౌమ్య

వీరులపాడు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌లు అందిస్తుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. మండలంలోని జుజ్జూరు



ముండ్లపాడులో పింఛన్ల పంపిణీలో సర్పంచ్ లావణ్య, వైస్ ఎంపీపీ వాసు తదితరులు

గ్రామంలో నిర్వహించిన పింఛన్‌ల పంపిణీని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. ఏడు వేల పింఛన్ అందించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో 90 శాతం మేర పింఛన్‌లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శివపార్వతి తెలిపారు. సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందించారని చెప్పారు.

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట):మండలంలోని అన్ని గ్రామాల్లో పింఛన్లు సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. గత ప్రభుత్వం ఇస్తున్న రూ. మూడు వేలతో పాటు నూతన ప్రభుత్వ హామీ మేరకు ఇచ్చిన పింఛన్ రూ. నాలుగు వేలను ఇంటింటికీ తిరిగి అందించారు. పలు గ్రామాల్లో రెండు గంటల పాటు సర్వర్‌లు పనిచేయకపోవటంతో సిబ్బంది అవస్థలు పడ్డారు. ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలిసి పింఛన్‌లు అందించారు. మండల స్థాయి అధికారులు, సిబ్బంది, సచివాలయాలు, పంచాయతీల సిబ్బంది, వీఆర్‌ఏలు, విద్యుత్, ఇరిగేషన్, ఏఎన్‌ఎంలు, సిబ్బందితో పింఛన్‌లను పంపిణీ చేయించారు. పింఛన్ల పంపిణీ బాధ్యత అప్పగించడంపై వీరంతా తలలు పట్టుకుంటున్నారు. వచ్చే నెల అయిన తమకు ఈ బాధ్యత నుంచి విముక్తి లభిస్తుందా అని గుసగుసలాడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.7000 పింఛన్ మొత్తాన్ని అర్హులకు అందిస్తున్నామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో అర్హులైన వారికి పింఛన్‌లు పంపిణీ చేశారు. అదే విధంగా కమలా థియేటర్ సెంటర్‌లోని పలు వార్డుల్లో మాజీ మంత్రి నెట్టెం రఘురాం పింఛన్లను పంపిణీ చేశారు.



కంచికచర్లలో లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

కంచికచర్లలో పింఛన్ల పంపిణీ

కంచికచర్ల: ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచి అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు అందించామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల అరుందతీనగర్, అంబేద్కర్ నగర్‌లలో సోమవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచటంతో పాటు గడిచిన మూడు నెలల పింఛన్ నగదు కలిపి రూ. 7 వేలు అందించామన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోగంటి బాబు, నాయకులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సచివాయం సిబ్బంది, అంగనవాడీ కేంద్రాల కార్యకర్తలు, టీడీపీ నాయకులు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.



జుజ్జూరులో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య



జగ్గయ్యపేటలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సమాజంలో వైద్యుల పాత్ర కీలకం

మక్కేపేట(వత్సవాయి): సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర ఆర్ఎంపీల సంఘ అధ్యక్షుడు కామినేని భూపాలరావు తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూపాలరావు మాట్లాడుతూ వైద్యో నారాయణ హరి అన్నారని వైద్యులను దేవుళ్లగా కొలుస్తారని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలుగా విధులు నిర్వహిస్తున్న వారు నిత్యం పేదలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తుండడం హర్షణీయమని చెప్పారు. ఆర్ఎంపీలు కూడా తమ పరిధిలోనే వైద్య సేవలు అందించాలని సూచించారు. తమ సంఘం తరుపున నిత్యం ప్రజాసేవ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న ఆర్ఎంపీల సంఘ నేత భూపాలరావు

కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలను పంచిపెట్టారు. కార్యాక్రమంలో హెచ్ఎంలు చిత్రాల వెంకటేశ్వరరావు, అజ్మీరు శ్రీనివాసరావు, ఆర్ఎంపీ సంఘ నాయకులు ఇరుకు భాస్కర్, ఎస్ భాస్కరరావు, వీవీ రామారావు,బెన్ని, రాణిలావణ్య, ప్రసాద్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

నందిగామ: జులై ఒకటో తేదీ నుంచి భారతదేశంలో అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్ మాట్లాడుతూ దేశంలో కొత్తగా అమల్లోకి తెచ్చిన చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐపీసీ ఇండియన్ పీనల్ కోడ్, ఇండియా ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లను కొనసాగించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు అద్దంకి మణి బాబు, ఎక్కిరాల హనుమంతరావు, విజయ్, ఈశ్వర ప్రగడ రంగారావు, మట్టా ప్రసాద్ , షేక్ కరిముల్లా, మన్నెం నారాయణరావు, కన్నెగంటి జీవరత్నం, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



కోర్టు సముదాయం ముందు నిరసన తెలియజేస్తున్న న్యాయవాలు

విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయండి

కంచికచర్ల: ఈ నెల 4వ తేదీన జరిగే దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీ నాయక్ పిలుపునిచ్చారు. అక్షర జూనియర్ కళాశాలలో బంద్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ మేరకు గోపీ నాయక్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్షల్లో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. అయితే ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్‌లో చర్చించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో కోట్లాది ధనం కుంభకోణం జరిగిందని ఆరోపించారు. దీనికి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ పదవి నుంచి తొలగిపోవాలని డిమాండ్ చేశారు. వన్ నేషన్ ఒక పరీక్ష అనే ముసుగులో మొత్తం పరీక్షా వ్యవస్థ కుప్పకూలిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు షేక్ జాహిదా, మాధవ్, గోపీ, ప్రేమ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.



బంద్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అభివృద్ధి పనులు, ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆషాఢ మాసంలో నిర్వహించే ఉత్సవ ఏర్పాట్లపై సోమవారం ఆలయ ఈవో కె.ఎస్. రామరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి దేవస్థానానికి చెందిన ముఖ్య అధికారులు హాజరయ్యారు. తొలుత దుర్గగుడి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అన్నదాన భవనం , లడ్డూ పోటుతో పాటు వెలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ నిర్మాణంపై ఆలయ ఈఈలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరో వైపున ఆలయ ప్రాంగణంలో నిర్మించిన యాగశాల, పూజా మండపాల పనుల పురోగతి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించే విశేష పూజలు, సేవలపై ఆలయ ఢేఈవోలు, సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశంలో చర్చించారు. రానున్న మాసంలో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుగుతుండటంతో భక్తుల రద్దీతో పాటు ప్రముఖుల రాక అధికంగా ఉంటుందన్నారు. ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు భక్తులకు అమ్మవారి దర్శనం త్వరితగతిన అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఈఈలు కేవీఎస్ కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, ఏఈవోలు ఎన్. రమేష్‌బాబు, చంద్రశేఖర్, జంగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రామరావు

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆటోడ్రైవర్ల నిరసన

కంచికచర్ల: హిట్ అండ్ రన్ కేసును తక్షణమే కేంద్ర ప్రభుత్వం రద్దుచేయాలని లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం. సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. గొట్టుముక్కల రోడ్డు, జుజ్జూరు రోడ్డు ఆటో స్టాండ్‌ల వద్ద సోమవారం ఆటో డ్రైవర్లతో కలసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు సోమేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారతీయ న్యాయ సంహిత చట్టంను 2024 జూలై1 అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ చట్టంలో ప్రమాదాలు జరిగి డ్రైవర్ హిట్ అండ్ రన్ అయితే ఏడు ఏళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. డ్రైవర్ల సంక్షేమం కోసం పనిచేయాల్సిన ప్రభుత్వాలు వారిపై కక్ష సాధింపు చర్యలు చేపట్టటం దారుణమన్నారు. ఇప్పటికైనా హిట్ అండ్ రన్ కేసును రద్దుచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బెజ్జం భూషణం, ఆటో యూనియన్‌నాయకులు భగవాన్, శౌరి, శ్రీను, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్ల ఆటో స్టాండ్ వద్ద నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆటో డ్రైవర్లు

2011 కౌలు రైతు చట్టాన్ని అమలు చేయాలి

చందర్లపాడు(నందిగామ టౌన్): 2019 సీసీఆర్సీ చట్ట సవరణ చేసి 2011 కౌలు రైతుల చట్టాన్ని అమలు చేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు డిమాండ్ చేశారు. చందర్లపాడు గ్రామంలో కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని అంగీకారంతో పని లేకుండా నేరుగా భూమి సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏడుకొండలు, శ్రీనివాసరావు, కస్తాల నాగేశ్వరరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఏలూరు చిన్న వెంకన్నకు చెందిన బృందం సోమవారం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదిక వద్ద సోమవారం సాయంత్రం కళాబృందానికి చెందిన పలువురు చిన్నారులు, మహిళలను అమ్మవారి పాటలు, కీర్తనలకు లయబద్ధంగా కోలాటాన్ని ప్రదర్శించారు. బుజ్జి... బుజ్జి... గణపయ్య..., గోగులో.. గోగుల్లో...., లేలేవయ్యా అంజనస్వామి, అంటూ పలు కీర్తనలను ఆలపించారు. కీర్తనలకు తగినట్లుగా బృందంలోని సభ్యులు కోలాటం ఆడగా, భక్తులను వీక్షించారు. అనంతరం బృందంలోని సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈవో కె.ఎస్.రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఉపగ్రహాలపై అవగాహన పెంచుకోవాలి

పన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఉపగ్రహాల సాంకేతికతపై అవగాహన పెంచుకొని ఆ దిశగా తీర్చిదిద్దుకోవాలని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ పుష్పవల్లితాయారమ్మ జల్లూరి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఉపగ్రహాల సాంకేతికత – అనువర్తనాలు – సమగ్ర పరిశీలన' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్త డాక్టర్ పుష్పవల్లి తాయరమ్మ జల్లూరి మాట్లాడుతూ ఆధునిక సామాజిక వికాసానికి ఉపగ్రహాలు అండగా ఉంటున్నాయన్నారు. శాస్త్రీయ పరిశోధనలను సమాజానికి అందించడంలో ఉపగ్రహాలు కీలకభూమికను పోషిస్తున్నాయన్నారు. వాతావరణం, సమాచార వ్యవస్థ, టెలికమ్యూనికేషన్స్ తదితర రంగాలకు సంబంధించి విస్తృతమైన సమాచారాన్ని ఉపగ్రహాల ద్వారా పొందుతున్నామన్నారు. పర్యావరణ విపత్తులను ముందుగా తెలుసుకొని నష్టనివారణకు ఉపగ్రహాల ద్వారా వచ్చే సమాచారం చాలా కీలకమవుతుందని వివరించారు. అంతరిక్ష అన్వేషణకు ఉపగ్రహాల వినియోగం ఇటీవల పెరిగిందని తెలిపారు. పలు దేశాలు ఉపగ్రహాల ద్వారా విస్తృతమైన ఆదాయ వనరులను పెంచుకుంటున్నాయని వివరించారు. ఉపగ్రహాల సాంకేతిక పరిజ్ఞానం, వాటి వినియోగంతో పాటుగా పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ పుష్పవల్లితాయరమ్మ ఇస్రో శాస్త్రవేత్తగా పని చేయడం కాలేజీకి గర్వకారణమన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు మరిన్ని విజయాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆర్.ఉదయ్‌కుమార్, అధ్యాపకులు బి.శ్రుతి, ఏహెచ్‌డీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పుష్పవల్లితాయారమ్మ

నడకతో ఆరోగ్యంగా జీవిద్దాం

డాక్టర్స్ వాకర్స్ క్లబ్ ఆవిర్భావ వేడుకల్లో డాక్టర్ ఎంవీరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతిరోజూ క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తే శారీరక, మానసికంగా ఆరోగ్యంగా జీవించవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంవీ రావు అన్నారు. నగరంలో ఏర్పాటైన డాక్టర్స్ వాకర్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ వేడుకలు సోమవారం జరిగాయి. సూర్యారావుపేటలోని మానస సైకియాట్రిక్ నర్సింగ్‌హోంలో జరిగిన వేడుకల్లో డాక్టర్ ఎంవీరావు నూతన కమిటీ సభ్యులతో బాధ్యతల స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి కారణంగా చిన్న వయస్సులోనే వ్యాధుల బారినపడుతున్నామని, ఈ నేపథ్యంలో వాకింగ్‌కు ప్రాధాన్యం పెరిగిందన్నారు. డాక్టర్స్ ప్రొఫెషన్‌లో ఉన్న వారందరూ వాకర్స్ క్లబ్ ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. డాక్టర్స్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ అయోధ్య, కార్యదర్శిగా డాక్టర్ జె భువనేశ్వరరావు, డాక్టర్ ఎంవీ సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో డాక్టర్ సూరే పవన్‌కుమార్, డాక్టర్ మానస కాజ, పి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో డాక్టర్ ఎంవీరావు, డాక్టర్ అయోధ్య తదితరులు

జిల్లా జైలులో నూతన చట్టాలపై అవగాహన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పార్లమెంట్ ఆమోదించిన నూతన చట్టాలపై సోమవారం జిల్లా కారాగారంలోని ఖైదీలకు అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో న్యాయవాదులు బి. సాంబశివరావు, ఎన్.కోటేశ్వరరావు, పద్మజ ఖైదీలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలపై నియమావళి, అమలు, ఖైదీలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సంస్కరణలపై, సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కారాగార పర్యవేక్షణాధికారి హంసపాల్, జైలర్ ఎన్.గణేష్, జైలర్ వేణు, డిప్యూటీ జైలర్ బి.గోపయ్యనాయక్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు మరింత చేరువగా సేవలు

ఎస్‌బీఐ డీజీఎం మనీష్‌కుమార్‌సింగ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వినియోగదారులకు బ్యాంక్ సేవలు మరింత చేరువ చేయడానికి మొబైల్ ఏటీఎం సేవలను ప్రారంభిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం మనీష్‌కుమార్‌సింగ్ అన్నారు. ఆ బ్యాంక్ 69వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జోనల్ కార్యాలంలో సోమవారం ఘనంగా చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు మెడికల్ క్యాంప్‌తో పాటు, రక్తదాన శిబిరం జరిగింది. అనంతరం మొబైల్ ఏటీఎం సేవల నూతన వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మనీష్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ ఎస్‌బీఐ సేవలకు వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సేవలు మరింత చేరువ కావడానికి మొబైల్ ఏటీఎం వాహనాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ వాహనం నగరంలోని పలు ప్రాంతాల్లో సేవలు అందిస్తుందన్నారు. ఈ వాహనంలో ఏటీఎంతో పాటు, డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశామని, దాని ద్వారా బ్యాంక్ అందిస్తున్న సేవలు, సౌకర్యాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. సైబర్‌నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అవాంఛిత ఫోన్ కాల్స్‌లో బ్యాంక్ వివరాలు, ఓటీపీలు తెలియజేయవద్దని సూచించారు. ఫోన్‌లో వచ్చే తెలియని లింక్స్ ఓపెన్ చేయవద్దన్నారు. వినియోగదారులకు ఎలాంటి సమాచారం అవసరమైనా తమ బ్రాంచిలను సందర్శించి వివరాలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు వి. విజయశేఖర్, ఏవీవీ రాజశేఖర్, వీఎస్ఆర్ శేఖర్, కె.సతీష్, ఎం.విజయమాధవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్‌బీఐ మొబైల్ ఏటీఎం వాహనాన్ని ప్రారంభిస్తున్న మనీష్‌కుమార్‌సింగ్

ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల విధులు బహిష్కరణ

జగ్గయ్యపేట: గిరిజన బాలుర సంక్షేమ పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు విధులు బహిష్కరించటంతో పట్టణంలోని గురుకుల పాఠశాలలో సోమవారం తరగతులు నిలిచిపోయాయి. ఇటీవల నూతన ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో గిరిజన గురుకులాల్లో 1147 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా చూపటంతో ప్రస్తుతం పాఠశాలల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను తీసుకోకపోవటంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. దీంతో పాఠశాలల్లోని ఆరుగురు ఉపాధ్యాయులు విధులు బహిష్కరించటంతో తరగతులు నిలిచిపోయాయి. పాఠశాలలో ప్రదానోపాధ్యాయుడు, ఏఎన్ఎం, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. పాఠశాలలు ప్రారంభమై 20 రోజులవుతుందని ఈ క్రమంలో ఉపాధ్యాయులు విధులు బహిష్కరిస్తే విద్యార్థుల భవిష్యత్తేంటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



జగ్గయ్యపేటలో తరగతులు లేకపోవటంతో ఖాళీగా ఉన్న విద్యార్థులు